బుచ్చిబాబుకి మండింది "ఏం...పీకలదాకా స్వీట్లూ దోశా తిని వేషాలేస్తున్నావా?" అని వెంకట్రావ్ కాలర్ పట్టుకుని చెంపలు వాయించాలనిపించింది.

కానీ సహనం తెచ్చుకుని అడిగాడు "అదే...చార్మినార్ చౌరాస్తాలో కిళ్ళీషాపువాడు వున్నాడన్నావే?"

"ఆ.....అవునవును....." గుర్తుచేసుకుంటూ బుర్రకాయి ఊపాడు వెంకట్రావ్.

"మరి కిళ్ళీషాపువాడు నా ట్రాన్స్ఫర్ ఎలా అవుతాడు".

"కిళ్ళీ షాపువాడంటే ఒట్టి కిళ్ళీషాపు వాడు కాదు.. వాడు హీరో నటవీర అభిమాన సంఘానికి ప్రెసిడెంట్"

"అయితే మనకేం ఉపయోగపడతాడు.

"చాలా ఉపయోగపడతాడు. వాడూ హిందీ నటుడు అమితాబ్ బచన్ అభిమాన సంఘం ప్రెసిడెంట్ ఏబ్రాసిఖన్నా చాలా క్లోజ్ఫ్రండ్స్, యాదగిరి ఏబ్రాసి ఖన్నాని కలిసి నీ ట్రాన్సఫర్ విషయం చెపితే యాబ్రాసిఖన్నా అమితాబ్కి నీ కేసు రికమెండ్ చేస్తే ఆయనగారు సోనియాగాంధీకి చెపితే ఆమె ఎవడయినా సెంట్రల్ మినిష్టర్కి చెపితే వాడు ఉరుకులు పరుగులు మీద మీ హెడ్డాఫీసుకు డి.ఒ లెటర్ రాసి నీ ట్రాన్స్ఫర్ అవుతాడు. మరి సోనియా గాంధీనా మజాకానా? రేపొద్దున్న పి.వినరసింహరావుని దింపేసి ఆమె ప్రయిమినిష్టరయిపోయినా అయిపోవచ్చు."

"అయితే ఓ కిళ్ళీషాపువాడిద్వారా మనం సోనియాగాంధిని సెంట్రల్ మినిష్టరుని అప్రోచ్ అయిపోవచ్చంటావు? ఇది నిజంగా జరిగేదేనంటావా? వినడానికే సిల్లీగా వుంది...." అనుమానంగా చూస్తూ అన్నాడు బుచ్చిబాబు.

"తప్పకుండా జరుగుతుంది. కాకపోతే యాదగిరికి ఢిల్లీకి రానుపోను ఛార్జీలు, హోటల్ ఖర్చులూ, పని జరిగాక వాడికి కాస్త కమీషన్స్ యివ్వాలి"

"కానీ ఈ చిన్న విషయానికి మనం సిల్లీగా సోనియాగాంధి లెవెల్ దాకా వెళ్ళితే బాగుండదేమో? పాపం ఇలాంటి చిన్న చిన్న పనులు అప్పగిస్తే సోనియాగాంధీ ఏమనుకుంటుంది?" సందేహంగా ఆడిగాడు బుచ్చిబాబు .

"అదీ నిజమేననుకో" సాలోచనగా మొహం పెట్టాడు వెంకట్రావ్ .

"అయితే మనం ఎవరినయినా స్టేట్ మినిస్టర్ని పట్టుకుని పని చేయించుకుందాంలే, నువ్వేం వర్రీకాకు. నీ విషయాలు నాకొదిలెయ్. రెండు రోజుల్లో నీ ప్రాబ్లం సాల్వ్ చేస్తా..." అని నిలబడ్డాడు. బుచ్చిబాబు కూడా లేచి నిలబడ్డాడు.

ఇద్దరూ హోటల్ లోంచి బయటపడ్డాడు.

0 0 0

బుచ్చిబాబు ఇంటికెళ్ళేసరికి ఇంటిలో తల్లిదండ్రులతో సిద్ధాంతి మాట్లాడుతున్నాడు.

"ఫిబ్రవరిలో ఓ మంచి ముహూర్తం వుందిగానీ అప్పుడు శని గురుడుని చూసి కన్ను కొడుతున్నాడు. మార్చిలో అయితే గురుడు శుక్రుడూ ఒకర్నొకరు కౌగిలించుకుని వున్నారు" చెపుతున్నాడు సిద్ధాంతి.

"ఏంటమ్మా...దేనికి సిద్ధాంతి గారితో మాట్లాడుతున్నారు? సత్యనారాయణవ్రతం ఏదయినా చేయిస్తున్నారా?" అడిగాడు బుచ్చిబాబు లోపలికి వస్తూ.

"కాదురా...నీ పెళ్ళికి ముహూర్తం పెట్టిస్తున్నాం" అంది పార్వతమ్మ.

"అయితే మార్చిలో ఫిక్స్ చేద్దామంటారా సిద్ధాంతిగారూ?" అడిగాడు పర్వతాలరావు.

"అలాగే ఆ ముహూర్తం మంచిదే" అన్నాడు సిద్ధాంతి.

"కానీ ఫిబ్రవరిలో ఏదో ముహూర్తం ఉందని అన్నారు?" అడిగాడు బుచ్చిబాబు.

"ఆ ముహూర్తంలో శని గురుడుని చూసి కన్నుకొడుతున్నాడని సిద్ధాంతిగారు చెప్పారు కదా" విసుక్కుంటూ అన్నాడు పర్వతాలరావు.

"అయితే ఏమవుతుంది?"

"అ ముహుర్తానికి పెళ్ళిచేస్తే శని గురుడిని వదిలేసి నీకు కన్నుకొడతాడు దాంతో నీ సంసారం గోవిందా బాబూ" చెప్పాడు సిద్ధాంతి.

"ఏరా వెధవాయ్ మార్చిదాకా ఆగలేవా? పెళ్ళికి అంత కంగారుగావుందా" అన్నాడు పర్వతాలరావు.

"కుర్రాడు కదండీ... పెళ్ళంటే హుషారుగానే వుంటుంది. సంసారం ఈదేప్పుడు తెలుస్తుంది మజా...." నవ్వుతూ అన్నాడు సిద్ధాంతి.

"ఉండండి దగ్గర్లో ఇంకేదయినా మంచి ముహూర్తం వుందేమో చూస్తాను" అని ఓ అరనిమిషంపాటు పంచాంగం తిరగేసి "దివ్యమయిన ముహూర్తం!" అన్నాడు.

"ఎప్పుడు?" అడిగింది పార్వతమ్మ

"ఇంకో మూడు వారాల్లోనే జనవరి ఇరవై తేదీన బుధుడు శుక్రుడ్ని ఓరగా చూస్తున్నాడు. శుక్రుడు కూడా బుధుడికి శక్తి వంచన లేకుండా కన్ను కొడుతున్నాడు. చాలా మంచి ముహూర్తం"

"అయితే ఆ ముహూర్తం అయితే బాగుంటుందేమో?" సిగ్గుపడుతూ అన్నాడు బుచ్చిబాబు.

"కానీ ఇంత దగ్గరలో వుంటే మనకి పెళ్ళి అరేంజ్ మెంట్లకి టైం వుంటుందా?" సందేహిస్తూ అన్నాడు పర్వతాలరావు.

"అయినా అరేంజ్‌మెంట్లు ఏముంటాయ్ నాన్నా? పెళ్ళికూతురు తరపువాళ్ళేవరూ

లేరు. కట్నం అసలేలేదు. పెళ్ళి సింపుల్‌గా చేసేసుకుంటాను" అన్నాడు బుచ్చిబాబు.

"సరే... అలాగే కానిద్దాం" అన్నాడు పర్వతాలరావు.

"శుభం! అయితే జనవరి ఇరవై తేదీకి ముహూర్తం సెటిల్ చేసేసి లగ్న పత్రిక రాసి తీసుకొస్తా" అంటూ లేచి నిలబడ్డాడు సిద్ధాంతి.

బుచ్చిబాబుకి సంతోషంతో గాఠిగా కెవ్వుమని కేకెయ్యాలనిపించింది. కానీ తండ్రెక్కడ ఆ వెధవ ఈ వెధవా అంటూ అడ్డమైన వెధవతిట్లు తిట్టి కేక లేస్తాడేమోనని భయపడి ఊర్కున్నాడు.

తన సంతోషాన్ని సీతతో వెంటనే పాలుపంచుకోవాలనిపించింది బుచ్చిబాబుకి. వేడివేడి కాఫీ తాగి బయట కెళ్ళి పబ్లిక్ ఫోన్ నుండి సీత వుండే వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్‌కి ఫోన్ చేసి పెళ్ళి జనవరి ఇరవైన జరగబోతున్నట్లు చెప్పాడు.

ఆ వార్త విని సీత కూడా ఎంతో సంతోషించింది. సీత శుభవార్త చెప్పేశాక తన చిన్ననాటి స్నేహితుడు కిరణ్‌తో తన ఆనందాన్ని పంచుకోవాలని అనుకున్నాడు బుచ్చిబాబు.

అక్కడికి రెండు ఫర్లాంగుల దూరంలోనే కిరణ్ ఇల్లు వుంది. బుచ్చిబాబు కిరణ్ ఇంటివైపు ఉత్సాహంగా అడుగులు వేసాడు. కిరణ్ ఇంటిని సమీపించి డోర్ బెల్ నొక్కుదామని అనుకున్న బుచ్చిబాబు ఆగిపోయాడు.

కారణం......

లోపలి నుండి పెద్దగా అరుస్తూ ఇద్దరూ పోట్లాడుకుంటున్నారు. ఒక ఆడ-ఒక మగా! మగ గొంతు కిరణ్‌ది. ఆడ గొంతు అతని భార్యది. ఇద్దరూ హోరాహోరీ దెబ్బలాడుకుంటున్నారు.

"నోర్మూయ్! ఇంకా ఎక్కువగా మాట్లాడావంటే పళ్ళు రాలగొడ్తాను" అది కిరణ్ గొంతు.

"రాలగొడ్తావా? ఏదీ రాలగొట్టు చూద్దాం. నేను కూడా చెయ్యి చేసోకగలను"

"ఓహో మొగుడంటే నీకంత గౌరవం వుందన్న మాట?"

"పెళ్ళాంకి మొగుడంటే గౌరవం వుండాలిగానీ మొగుడికి పెళ్ళాం అంటే గౌరవం ఉండక్కర్లేదు. మొగుడు పెళ్ళాన్ని నానా మాటలు అనొచ్చు... అంతేనా నువ్వనేది !?....

"ఛీఛీ..నీతో మాట్లాడితే పేడమీద రాయి వేసినట్టే...."

"నీతో మాట్లాడితే అంతకంటే హీనమైన దానిమీద రాయి వేసినట్టే..."

"నోరు మూస్తావా లేదా దొంగలం..."

బుచ్చిబాబు డోర్ బెల్ మీద నుండి చెయ్యి తీసి వెనక్కి తిరిగి ఇంటిదారి పట్టాడు. అతని మొదడు మొద్దుబారిపోయింది.

కిరణ్ సంసార జీవితం ఇంత ఘోరంగా వుందా? ఎందుకని? కిరణ్, అమ్మాయి ఇద్దరూ ఒకరినొకరు ఎంతగానో ప్రేమించి పెళ్ళి చేసుకున్నారు.

మరి వాళ్ళ సంసారం ఏంటి ఇలా ఉంది. రేపు తనూ, సీత కూడా ఇంతేనా?

బుచ్చిబాబు భారంగా నిట్టూర్చాడు.

# 5

"అదిగో అదే మినిష్టర్ మిన్నారావ్‌గారిల్లు!" ఫర్లాంగు దూరంలోవున్న తెల్లని బంగాళాని చూపించాడు వెంకట్రావ్ బుచ్చిబాబుకి.

"అమ్మో...ఎంత పెద్ద బంగాళానో?" అన్నాడు బుచ్చిబాబు.

"మరేమనుకున్నావ్ ... మినిష్టరా మజాకా?"

"ఇదేదో సినిమా టైటిల్‌లా బానేవుందే సిల్లీగా?"

"నీకు ప్రతిదీ సిల్లీగానే వుంటుంది. ఒకప్పుడు మిన్నారావ్ ఏంటో తెలుసా?" అడిగాడు వెంకట్రావ్.

"పెద్ద బిజినెస్ మాగ్నెట్ అయివుంటాడు. లేకపోతే ఇంత పెద్ద బంగాళా ఎలా వుంటుంది.

"కాదు..." తల అడ్డంగా ఊపాడు వెంకట్రావ్.

"కొంపదీసి స్మగ్లరా ఏంటి?" అడిగాడు బుచ్చిబాబు.

"కాదు......కాదు......కాదు.....! అయినా నువ్వు ఊహించలేవు. అందుకే చెప్పేస్తున్నా...రిక్షా వోడు"

"ఆ సినిమా నిర్మాతా?" ఆశ్చర్యంగా అడిగాడు బుచ్చిబాబు.

"నీ బొంద.... ఆ సినిమా ఇప్పటిదే కదా? అయినా నేను చెపుతున్నది సినిమా టైటిల్ కాదు ... మిన్నారావ్ ఒకప్పుడు రిక్షా తొక్కేవాడు"

"సిల్లీగా నువ్వు మాట్లాడ్తావ్ నేను కాదు. మా నాన్నగారు కూడా రెండుమూడుసార్లు ఎక్కాడంట!"

"ఇంకేం ఆ విషయం చెప్పి పరిచయం చేస్కుంటే నా పని క్షణాల్లో జరిగిపోతుందేమో?" సంబర పడిపోతూ అన్నాడు బుచ్చిబాబు.

"ఆ ప్రసక్తి చెపితే నీపని చెయ్యడు. నీ పని పడ్తాడు. వెంటనే మనిద్దర్నీ పనాళ్ళతో మెడ పెట్టి గెంటిస్తాడు" సీరియస్‌గా చూస్తూ అన్నాడు వెంకట్రావ్.

"అసలు రిక్షా తొక్కేవాడు మినిష్టర్ ఎలాగయ్యాడో?" ఆశ్చర్యపోతూ అన్నాడు బుచ్చిబాబు.

"ఆ విషయాలు తర్వాత చెప్తా. ఇల్లొచ్చేసింది" అన్నాడు వెంకట్రావ్.

ఇద్దరూ గేటు దగ్గరకెళ్ళారు "ఎవరు కావాలి?" అడిగాడు గుర్ఖా.

"మినిస్టర్ మిన్నారావ్‌గార్ని కలవాలి" చెప్పాడు వెంకట్రావ్.

"ఆయన లేరు.. .బయటి కెళ్ళిండ్రు"

"ఎక్కడికి వెళ్ళాడు?"

"ఏమో...తెల్వది!"

"ఎప్పుడొస్తారు?"

"గదీ ఛీ తెల్వది!" నిర్వికారంగా చెప్పాడు గుర్కావాడు.

ఏ భావమూలేని వాడి మొహాన్ని చూస్తే వెంకట్రావ్‌కి మండింది.

"అమ్మగారున్నారా?" విసుగుని అణుచుకుంటూ ప్రశ్నించాడు వెంకట్రావ్ .

"ఉన్నారు. అమ్మగారితో ఏంపని?"

"అబ్బా! మేం వీళ్ళకి చుట్టాలం లేవయ్యా బాబూ" విసుక్కున్నాడు వెంకట్రావ్ .

గూర్ఖా వెంటనే సల్యూట్ చేసి "లోపలికి పోండ్రి సార్!" అన్నాడు.

ఇద్దరూ లోపలికి అడుగులు వేసారు. మినిస్టర్ మిన్నారావ్‌కి క్లోజ్ ఫ్రెండ్ అయిన వీరేశం వెంకట్రావ్ తండ్రికి బాగా తెలుసు. వెంకట్రావ్ బుచ్చిబాబు గురించి తండ్రికి చెప్పి అయనతో వీరేశంకి చెప్పించి వీరేశం నుంచి రికమెండేషన్ లెటర్ తీసుకుని వచ్చాడు వెంకట్రావ్. ఆ లెటర్ మినిస్టర్ మిన్నారావుకి చూపించాలని వచ్చారు ఇద్దరూ.

వెంకట్రావ్ డోర్ బెల్ నొక్కాడు. నాలుగు క్షణాల తర్వాత తలుపులు తెరుచుకున్నాయి. ఓ మధ్య వయస్కురాలైన ఆవిడ ఇద్దర్నీ తేరపార చూసింది.

"ఏటి?" అడిగిందామె.

"మీ అయ్యగారి కోసం వచ్చాం" చెప్పాడు బుచ్చిబాబు  ఆమె అయోమయంగా బుచ్చిబాబు  వంక చూసింది.

వెంకట్రావ్ కంగారు పడిపోయాడు.

"ఓర్నీయబ్బ! ఆమెను పని మనిషనుకుంటున్నావా ఏంటి? ఆవిడే మినిస్టర్ మిన్నారావు గారి భార్య వెంకటలక్ష్మి" బుచ్చిబాబు చెవిలో కోపంగా చెప్పాడు.

"అదేనండి మేం మినిస్టర్ మిన్నారావు గారి గురించి వచ్చాం" అన్నాడు వెంకట్రావ్.

వెంకటలక్ష్మి గూర్ఖావంక చూస్తూ అరిచింది "ఒరేయ్ గూర్కా ఆయనల్లేరని ఈళ్ళకి సెప్పలేదా?"

"చెప్పినానమ్మా.... మీతో మాట్లాడతారేమోనని పంపినా" అన్నాడు గూర్కావాడు అక్కడి నుండే.

"ఏటి?" మళ్ళీ వెంకట్రావుని చూస్తూ అడిగింది.

"వీరేశంగారు పంపిస్తే వచ్చాం" చెప్పాడు వెంకట్రావ్ .

"ఆయన లేరుగదా కటింగ్ షాప్ ఓపెనింగ్స్ చెయ్యడానికెళ్ళారు"

"అదేంట్రా బాబు....మరీ బార్బర్ షాపు ఓపెనింగ్‌కి కూడా వెళతారా మినిష్టర్లు....వెరీ సిల్లీ..." గుసగుసలాడుతూ అన్నాడు బుచ్చిబాబు .

"నువ్వు కాసేపు నోరు మూస్కుంటావా?" బుచ్చిబాబు చెవిలో తిట్టాడు వెంకట్రావ్ .

"ఏటి ......ఊర్కే ఆయన చెవులు తినేస్తున్నావ్?" అంది వెంకటలక్ష్మి.

"మావాడికి చెవులు సరిగా వినిపించవులెండి. ఏం చెప్పినా వాడికి అలా చెవిలోనే

చెప్పాలి!” అన్నాడు వెంకట్రావ్ పకపకా నవ్వుతూ.

“మంచి బాగోతమే....”

“మరి మినిష్టర్‌గారు ఎప్పుడొస్తారండీ?”

“ఓ గంట తరువాత వస్తారు. మీరేమైనా స్వీట్లూ, పళ్ళూ మోసుకొచ్చుంటే ఇటిచ్చేసి ఆనక రండి”

“చచ్చాం...మనం ఏమీ తేలేదే ఎలా?” అన్నాడు బుచ్చిబాబు వెంకట్రావ్ చెవిలో.

“తర్వాత వచ్చేటప్పుడు తెద్దాంలే” అన్నాడు వెంకట్రావ్ బుచ్చిబాబు చెవిలో.

“అతగాడు నీ చెవిలో ఎందుకు మాట్లాడుతున్నాడు?” వెంకటలక్ష్మి ఆశ్చర్యంగా చూస్తూ అడిగింది.

“హిహిహి...అంటే వీడికి చెవులు వినబడవు కాబట్టి...అందరికీ వినబడవనుంకుటాడండీ వెర్రి సన్నాసి....హి” అన్నాడు వెంకట్రావ్ .

“హత్తెరికి!” అంది ఆమె ఆశ్చర్యంగా మొహంపెట్టి.

“సరేగానీ పళ్ళూ, స్వీట్లూ ఇటిచ్చి తర్వాత రండి” అంది.

“అవేం తేలేదు మేడం. తర్వాత తెద్దామని అనుకున్నాం...” అన్నాడు వెంకట్రావ్ నీళ్ళు నములుతూ.

“అట్టానా?” అంటూ ఇద్దరి మొహాల మీదా ధడేల్‌మని తలుపేసేసింది వెంకటలక్ష్మి.

ఇద్దరూ కాళ్ళీడ్చుకుంటూ బయటకొచ్చారు.

“ఛీ...ఒట్టి చేతులతో వచ్చి పరువు పోగొట్టుకున్నాం...” అన్నాడు వెంకట్రావ్.

“ఎందుకూ? మళ్ళీవస్తాంగా...అప్పుడు చూద్దాం? ఇంతకీ ఇప్పుడేం చేద్దాం?” అడిగాడు బుచ్చిబాబు.

“ఏం చేయడం ఏంటి....మినిష్టర్ మిన్నారావ్ వచ్చేదాకా ఇక్కడే కాపెయ్యాలి! ఇప్పుడే ఆ స్వీట్లూ, పళ్లూ కొనేద్దాం” అన్నాడు వెంకట్రావ్.

బుచ్చిబాబు బుర్రకాయ్ ఊపాడు. ఇద్దరూ దగ్గర్లో ఉన్న మార్కెట్‌కి వెళ్ళి కిలో స్వీట్లూ, రెండు డజన్ల యాపిల్స్ కొన్నారు. అక్కడి నుండి మినిష్టర్ మిన్నారావు ఇంటికి కాస్త దూరంలో వున్న తూముమీద కూర్చున్నారు.

“మినిష్టర్ గారి భార్య మాటేంటి మరీ అంత యాసగా వుందీ?” అడిగాడు బుచ్చిబాబు.

“ఇప్పుడంటే మినిస్టర్ భార్యగాని ఇదివరకు రిక్షా వోడి భార్యేకదా? ఆ భాష ఇంకెలా ఉంటుందీ?” అన్నాడు వెంకట్రావ్.

“అవునూ ఇందాక మిన్నారావు మినిస్టర్ ఎలా అయ్యాడో చెప్తాన్నన్నావు?”

వెంకట్రావ్ గొంతు సవరించుకున్నాడు.

“ఈ మిన్నారావ్ రిక్షా తొక్కే టైంలో చాలా యాక్టివ్‌గా ఉండేవాడు. అందుకే రిక్షా కార్మికుల యూనియన్‌కి లీడర్‌గా ఉండేవాడు. ఆ తర్వాత స్లోగా డెవలప్ అయి రిక్షా అవతల

పారేసి ఆటో కొనుక్కున్నాడు. త్వరలోనే ఆటో డ్రైవర్ల యూనియన్‌కి కూడా లీడర్ అయ్యాడు. ఆ యూనియన్‌కి లీడరుగా ఉండగానే గూండాలు, దాదాలతో మంచి పరిచయాలు ఏర్పడ్డాయి. లోకల్‌గా కాస్త పవర్‌ఫుల్ అయ్యాడు. ఈలోగా అసెంబ్లీ ఎన్నికలు వచ్చాయి. అప్పుడు ఈ కాన్‌స్టిట్యూయెన్సీ నుంచి స్వాతంత్ర్య సమరయోధుడు, ప్రముఖ సంఘ సేవకుడు అయిన మోహన్‌రావుగారు ఇండిపెండెంట్‌గా నిలబడ్డారు. ఆయనకి ఎదురు నిలబడి గెలిచే సత్తా ఏ పార్టీలోనూ, ఎవరికీ లేదు...ఒక్క మిన్నారావుకు తప్ప!"

"అందుకే కాంగ్రెసు వాళ్ళ కన్ను మిన్నారావు మీద పడింది. వాళ్ళొచ్చి ఇతన్ని పార్టీలో చేరమని, ఎమ్మెల్లేగా నిల్చోవడానికి టిక్కెట్టిస్తామనీ అడిగారు. ఇతను ఈ రాజకీయాలు నాకలవాటు లేదు. నాకిట్టానే బాగుంది నేను చేరను పొమ్మన్నాట్ట. అప్పుడు అప్పటి ప్రధాని రాజీవ్‌గాంధే స్వయంగా ఇతనికి ఫోన్‌చేసి రిక్వెస్టు చేస్తే కాంగ్రెసు పార్టీలో చేరి ఎన్నికల్లో నిలబడి మోహన్‌రావుగారిని చిత్తుచిత్తుగా ఓడించాడు. మరి రిగ్గింగ్ చేసే దాదాలు గూండాలు ఇతని చేతిలోనే ఉన్నారు కదా"

"ఎమ్మెల్యే అయ్యాక ఇతని కన్ను మంత్రిపదవి మీద పడింది. కానీ ఎంత ప్రయత్నించినా ఇతనికి మంత్రి పదవి ఇవ్వలేదు దాంతో మిన్నారావ్ పాత బస్తీలో మత కలహాలు సృష్టించి అరాచకాలు సృష్టించాడు. ఇతని బాధ పడలేక ఇతని మొహాన మంత్రి పదవి పడేశారు. అప్పటీ నుండీ మంత్రి పదవి వెలగబెడుతూనే వున్నాడు. కాంగ్రెస్ పని అయిపోతుంది అని అంచనా కట్టి తెలుగు దేశంలో దూకేశాడు. ఆ తర్వాత యన్టీఆర్ వర్గంలోంచి చంద్రబాబు వర్గంలో దూకాడు. అలా తన పదవిని కాపాడుకుంటూ వస్తున్నాడు" చెప్పడం ఆపాడు వెంకట్రావ్.

"ఊహూ... అయితే చాలా పవర్‌ఫుల్లే. నువ్వు రిక్షావాడంటే సిల్లీఫెలో అనుకున్నా" అన్నాడు బుచ్చిబాబు.

"అయితే ఇతను చెపితే నా ట్రాన్స్‌ఫర్ ఆగిపోతుంది కదూ?"

"నైన్‌టీనైన్ పర్సెంట్ ఆగిపోతుంది."

"కానీ ఇతను మన మాట వింటాడంటావా?" సందేహంగా అడిగాడు బుచ్చిబాబు.

"వినకపోతే ఇంకా పవర్‌ఫుల్ రికమెండేషన్ పెట్టిస్తాం!"

"అంటే సెంట్రల్ మినిస్టర్‌దా?"

"కాదు...మిన్నారావుకి ఒక ఉంపుడు కత్తె వుంది. దాన్ని పడతాము!"

"ఛీ....ఛీ...దాన్ని మనమెందుకు పట్టాలి సిల్లీగా? నాకేం ఇంట్రెస్టు లేదు బాబూ" అన్నాడు బుచ్చిబాబు మొహం అసయ్యంగా పెట్టి.